ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కరీంనగర్

జిల్లా వార్తలు

ఆదివారం 21 జూలై 2024



జిల్లాలో విస్తారంగా వర్షాలు

- చెరువులు, కుంటల్లోకి చేరుతున్న వరద నీరు
- ఊపందుకున్న వరి నాట్లు

కరీంనగర్ టౌన్, జూలై 20: జిల్లాలో మూడు, నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు వేడి, ఉక్కపోతతో ఇబ్బందిపడ్డ ప్రజలు వాతావరణం చల్లబడటంతో ఊపిరిపీల్చుకున్నారు. చెరువులు, కుంటల్లో వరద నీరు చేరుతుండడంతో భూగర్భ నీటిమట్టం పెరిగి బావులు, బోరుబావుల్లోకి నీరు చేరుతోంది. వరి నాట్లు ఊపందుకున్నాయి. పత్తిసాగు చేసిన రైతులు ఈ వర్షం మేలు చేస్తుం దని ఆనం దం వ్య క్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలో 9.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జమ్మికుంట మండలంలో 23.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇల్లందకుంట మండలంలో 21.2, హుజూరాబాద్‌లో 15.2, మానకొండూర్‌లో 10.2, సైదాపూర్‌లో 10, చొప్పదండిలో 8.4, శంకరపట్నం 8.2, చిగురుమామిడిలో 7.8, కరీంనగర్‌లో 6.6, గన్నేరువరంలో 6.2, కరీంనగర్ రూరల్‌లో 6, గంగాధరలో 5.6, వీణవంకలో 5.4, రామడుగులో 4.8, తిమ్మాపూర్‌లో 4.2 మిల్లీమీటర్లు వర్షం కురిసింది.

- ముసురుతో కూలిన ఇంటిపై కప్పు

రెండు, మూడురోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షంతో నగరంలోని ఓ పెంకుటిల్లు పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఆ ఇంటి కుటుంబసభ్యులు అప్రమత్తంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. నగరంలోని 32వ డివిజన్ గోదాంగడ్డలో అజ్జూ అనే వ్యక్తి నివాస పెంకుటిల్లు పైకప్పు శుక్రవారం తెల్లవారుజామున కూలింది. విషయం తెలుసుకున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్ షకీరా అంజూమ్‌బర్కత్ అలీతో కలిసి ఆ ఇంటిని పరిశీలించి, బాధిత కుటుంబసభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ ఇంటిని ఖాళీ చేయించారు. వెంటనే వారికి తక్షణ సహాయం అందించాలని రెవెన్యూ అధికారులను



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

ఫోన్‌లో కోరారు. నగరంలో పలు చోట్ల రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టి మట్టితో మూసుకున్న డ్రైనేజీలను ఓపెన్ చేయించి సులువుగా నీరు డ్రైనేజీలోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఈసందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున శిథిలా వస్థలో ఉన్న ఇళ్లలో నివాసముంటున్న వారు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బందిని అప్రమత్తం చేసి, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు అందించాలని ఆదేశించారు. నగరంలో 107 శిథిలావస్థ భవనాలు, ఇళ్లు ఉన్నట్లు టౌన్‌ప్లానింగ్ అధికారుల ద్వారా గుర్తించి, నోటీ సులు జారీ చేశామన్నారు. నోటీసులు అందిన ఇంటి యజమానులు వెంటనే ఇళ్లను ఖాళీ చేసి వెళ్లాలని సూచించారు. శిథిలా వస్థలో ఉన్న 20 గృహాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చి వేశారని చెప్పారు. నగరంలో వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఎక్కడైనా ఇబ్బం దులు ఏర్పడితే వెంటనే కార్పొరేటర్లకుగానీ, నగరపాలక సంస్థకు గానీ సమాచారం అందిం చాలని కోరారు. 24 గంటలు సహాయక చర్యలు అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉంటారని, నగరపాలక సంస్థ సేవలను సద్విని యోగం చేసు కోవాలని మేయర్ కోరారు.



తెలంగాణ చౌక్ లో కురుస్తున్న వర్షం

అంగన్‌వాడీల్లో అక్షరాభ్యాసం



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, జూలై 20: నగరంలోని కోతిరాంపూర్ అన్నమనేని గార్డెన్‌లో శనివారం మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమ్మ మాట..అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ పమేలాసత్పతి ముఖ్యఅతిథిగా హాజరై అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను ఒడిలో కూర్చోబెట్టుకొని అక్షరాలను దిద్దించారు. అంతకుముందు అంగన్‌వాడీ కేంద్రాలోన్ని బోధన పరికరాలను, ఆట వస్తువులను, పుస్తకాలను, పరిశీలించారు. చిన్నారులు, గర్భిణీలకు అందించే పోషకాహారాన్ని తిలకించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అజయ్‌యాదవ్, మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడీకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

- నగరంలోని జ్యోతినగర్ శ్రీసంతోషిమాత, హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 59, 60 డివిజన్ల కార్పొరేటర్లు గందె మాధవి మహేశ్, వాల రమణారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న, టీచర్స్ కాత్యాయిని, విజయలక్ష్మి, సైదాబి పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలి

- రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా..
- నూతన చట్టాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- నేర సమీక్ష సమావేశంలో సీపీ అభిషేక్ మొహంతి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, జూలై 20: కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసు అధికారులంతా విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలని సీపీ అభిషేక్ మొహంతి అన్నారు. కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం అన్ని విభాగాల అధికారులు, ఎస్‌హెచ్‌వోలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసు అధికారులు గ్రామ, నగరంలో వార్డుల సందర్శనలు చేయాలన్నారు. స్థానికంగా వుండే ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందేలా సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలన్నారు. డయల్ 100 ద్వారా వచ్చే ప్రతీ ఫిర్యాదును వాస్తవంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెలా వారికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారితో పాటు, ప్రజలను మోసం చేసే వారిపై షీట్లను తెరవాలన్నారు. వయసు మళ్లిన, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడే వారిని, సత్ప్రవర్తనతో మెదిలే వారిని గుర్తించి షీట్‌లను సమీక్షించి ఎత్తివేయాలని సూచించారు. దేశ వ్యాప్తంగా ప్రవేశపెట్టిన నూతన చట్టాల అమలుపై ప్రతి పోలీసు అధికారి ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని, నూతన చట్టాలకు అనుగుణంగా కేసులు నమోదు చేసి వాటిని అమలు పరచాలన్నారు. సంఘటనకు అనుకూలంగా నమోదు చేసే సెక్షన్ల విషయంలో సందేహాలు ఏర్పడితే సీఐడీ విభాగ ఆధీనంలో ఏర్పాటు చేసిన ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెల్ ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. గంజాయి నియంత్రణపై దృష్టి పెట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల వారీగా సైబర్ వారియర్లను నియమించామని, సైబర్ నేరం జరిగిందని తెలిసిన వెంటనే వారు స్పందించి, బాధితులకు సహకరించి 1930కి, ఎన్‌సీఆర్‌బీ పోర్టల్‌కు సమాచారం అందించి అకనాలెడ్జ్‌ను పొందాలన్నారు. దాని ఆధారంగా పోగొట్టుకున్న సొత్తును తిరిగి తెప్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డివిజన్ల వారీగా రోడ్డు ప్రమాదాలపై సీపీ సమీక్ష చేశారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తించి, వాటికి గల కారణాలను తెలుసుకుని అవసరమైతే ఇతర శాఖల సమన్వయంతో సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో వున్న కేసుల వివరాలు, అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. భౌతిక నేరాలకు సంబంధించిన వారెంట్లను అమలయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ(శాంతి భద్రతలు) ఎ లక్ష్మీనారాయణ, అడిషనల్ డీసీపీ (ఏఆర్) అనోక్‌జైన్, ఏసీపీలు శ్రీనివాస్ (సీఎస్‌బీ), నరేందర్, వెంకటరమణ, శ్రీనివాస్‌జీ, విజయ్ కుమార్, వేణుగోపాల్, కాశయ్య, నర్సింహారెడ్డి (సైబర్ క్రైమ్ పీఎస్) పాల్గొన్నారు.

అధ్వానంగా రాజీవ్ రహదారి

- చిన్నవర్షాలకే పెద్ద పెద్ద గుంతలు
- రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు
- కనిపించని సూచిక బోర్డులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



రాజీవ్ రహదారిపె ఏర్పడుతున్న పగుళ్లు



కనిపించని సూచిక బోర్డులు



ప్రమాదకరంగా ఉన్న గుంత

తిమ్మాపూర్, జూలై 20: హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఉమ్మడి జిల్లావాసులకు ప్రధాన మార్గమైన రాజీవ్ రహదారి అధ్వానంగా మారింది. హైదారాబాద్ - కరీంనగర్ - రామగుండం రాజీవ్ రహదారి 207.4 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. జిల్లాలోని తిమ్మాపూర్ మండల పరిధిలో 20 కిలోమీటర్ల మేరకు ఉంది. చిన్నపాటి వర్షాలకే రహదారిపై గుంతలు పడి కంకర తేలింది. ఈ రహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఉంటాయి. గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసినప్పుడు ఏర్పడ్డ గుంతలకు ప్యాచ్‌వర్క్ చేసి వదిలేస్తున్నారు. రహదారిపై గుంతల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతల కారణంగా వాహనాలు చెడిపోతున్నాయని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, టోల్ వసూలు కాంట్రాక్టర్ రహదారిని పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

- ప్రమాదకర మలుపులతో ఇబ్బందులు

రాజీవ్ రహదారిపై అనేక మూల మలుపులు ఉన్నాయి. ఈ రాజీవ్ రహదారిపై అనేక మూల పలుపులు ఉండడంతో వాహనాదారులు ఇబ్బంది పడుతున్న పరిస్థితిపై అధికారులు గతంలో మూల మాలుపులు మారుస్తాం అని చెప్పిన అది అచరణలోని రాలేదు. దీంతో మూల మలుపుల కారణంగా అనేక ప్రమాదాలు సంబవిస్తున్నాయి. ఈ రాజీవ్ రహదారిపై రోడ్డుకు ఇరువైపులా ఏపుగా చెట్లు పెరగడంతో వాటి కొమ్మలు రోడ్డుపైకి వస్తున్నాయి. దీంతో ముందు వెళ్లే వాహనాలు కనిపించడం లేదు. రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను చెట్లు కమ్మేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణం చేసేటప్పుడు రోడ్డు పక్కన చెట్లతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. డివైడర్ మధ్యలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. రాజీవ్ రహదారిపై ఉన్న సమస్యలను టోల్‌ప్లాజా యాజమాన్యం, అధికారులు పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

'శాతవాహన'పై విజిలెన్స్

- అక్రమాలు జరిగాయంటున్న విద్యార్థి సంఘాలు
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



గణేశ్‌నగర్, జూలై 20: శాతవాహన విశ్వవిద్యాలయం సమస్యలతో సతమతమవుతోంది. శాతవాహన విశ్వవిద్యాలయంలో మాజీ వీసీతోపాటు విధులు నిర్వహిస్తున్న కొంతమంది సిబ్బంది అక్రమాలకు, అవినీతికి పాల్పడినట్లు విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈ విషయాన్ని ఉన్నత విద్యా మండలి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. స్పందించిన ప్రభుత్వ విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిందని తెలిసింది. విచారణ పారదర్శకంగా జరగాలంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను బాధ్యతల నుంచి తప్పించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గత వీసీ ప్రభుత్వ పెద్దల సిఫారసుతో బోధ నేతర సిబ్బందిని అవసరానికంటే ఎక్కువ సంఖ్యలో నియమిం చారని, యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా రిటైర్డ్ అధ్యాపకులను నియమించారనే ఆరోపణలున్నాయి. కనీస అర్హత లేకపోయినా ప్రొఫెసర్లుగా, అసోసియేట్ ప్రొఫెసర్లుగా ప్రమోషన్లను ఇచ్చారని విద్యార్థి సంఘాలు విమర్శించాయి. ఈ అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాయి.

- ఎలాంటి నోటీసులు రాలేదు

- వరప్రసాద్, ఎస్‌యూ రిజిస్ట్రార్

విజిలెన్స్ విచారణపై ఇప్పటివారకు ఎలాంటి నోటిసులు రాలేదు. యూనివర్సిటీలో అవినితి, అక్రమాలు అంటూ వస్తున్న ఆరోపణలో వాస్తవం లేదు. ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

సమస్యల పరిష్కారానికి 'విద్యుత్ ప్రజావాణి'

గణేశ్‌నగర్, జూలై 20: వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నామని కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వంఢ్లకొండ గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని టీజీ ఎన్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలోని అన్ని ముఖ్య కార్యాలయాల్లో నిర్వహిస్తున్నామన్నారు. వినియోగదారులు తమ సమస్యలపై డివిజన్ ఆఫీస్, ఈఆర్వో, సబ్ డివిజన్ ఆఫీస్, సెక్షన్ ఆఫీస్‌లో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, సర్కిల్ ఆఫీస్‌లో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని పరిష్కరించాలి

- బీజేపీ నాయకుల డిమాండ్
- ఒక్కరోజు దీక్షకు పలువురు నాయకుల మద్దతు

సిరిసిల్ల రూరల్, జూలై 20: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంతో పాటు అసాములు, కార్మికులకు ఉపాధి కల్పించి విద్యుత్ సబ్సిడీని కొనసాగించాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రెడ్డబోయిన గోపి, కరీంనగర్ పార్లమెంటరీ కో కన్వీనర్ అడెపు రవీందర్‌లు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సెస్ కార్యాలయం ఎదుట శనివారం భారతీయ జనతా పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఒక రోజు దీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న బీజేపీ నాయకులకు చేనేత వస్త్ర వ్యాపార సంఘం పాలిస్టర్ వస్త్ర ఉత్ప త్తిదారుల సంఘం, కాటన్ ఉత్పత్తి దారుల సంఘం, అసాముల సమన్వయ కమిటీ సంఘం, డైయింగ్ అసాముల సంఘం నాయకులు దీక్ష శిబిరాన్ని సంద ర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ మనుగడ కోసం ఉచిత విద్యుత్ కావాలని, అలాగే మరమగ్గాల కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇ వ్వాల్సిన పది శాతం యారన్ సబ్సిడీతో పాటు కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వర్కర్‌టు ఓనర్ పథకాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మరమగ్గాల పరిశ్రమకు సంబంధించిన కరెంట్ పాత బకాయిలను మాఫీ చేయడంతో పాటు బతుకమ్మ చీరలకు సంబంధించిన పెండింగ్ బకాయిలను ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కొత్త ఆర్డర్లను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడంతో పాటు నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించాలని కోరారు. సిరిసిల్లలో ఎనిమిది నెలలుగా ఉపాధి లేక ఆత్మహత్యలకు పాల్పడ్డ కార్మిక కుటుంబా లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండ నరేష్, మోర రవి, గాజుల సదానందం, కోడం అనంద్ బాబు, దుమాల శ్రీకాంత్, గాజుల వేణు, మేర్గు శ్రీనివాస్, కోడం రవి, సుంచు ప్రకాష్, కోడం శ్రీనివాస్, తవుటు రాజలింగం, వడ్నా ల శ్రీకాంత్, వేముల రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న బీజేపీ నాయకులు

జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

జమ్మికుంట రూరల్, జూలై 20: రవాణా రంగ కార్మికుల సమస్యలపై మంగళవారం కరీంనగర్‌లో నిర్వహిస్తున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి అన్నారు. జమ్మికుంటలో శనివారం 200మంది ట్రాలీ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా పున్నం రవి వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోటారు రవాణ రంగ కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు కార్మికులకు అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. డ్రైవర్లకు ఉరితాడుగా మారిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డిజిల్, ఇన్సూరెన్స్, ఫిటెనెస్ ధరలు తగ్గించాలన్నారు. ఐదు లక్షల ప్రమాద బీమా ఏ షరతు లేకుండా వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే డిమాండ్లు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే ఆందోళనలు చేస్తామని తెలిపారు. కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌లో గల ముకుందా లాల్ మిశ్రా సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చెలికాని శ్రీనివాస్, మౌటం రఘు, ప్రధాన కార్యదర్శి పూలవేన కుమార్, పర్లపల్లి పవన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడ్డ నక్కలు

- సురక్షితంగా బయటకు తీసిన ఫారెస్ట్ అధికారులు



అధికారులు బయటకు తీసిన నక్క

కథలాపూర్, జూలై 20: మండలంలోని బొమ్మెనలో శనివారం ఓ రైతు బావిలో రెండు నక్కలు పడ్డాయి. రైతు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో కొడిమ్యాల డిప్యూటీ రేంజ్ అధికారి ముషీర్ అహ్మద్ నేతృత్వంలో నక్కలను సురక్షితంగా బయటకు తీశారు. బీట్ అధికారి మధుసూదన్, వాచర్లు గంగాధర్, ఎర్రయ్య, నల్లగొండం స్థానిక రైతులతో కలిసి వలల సహాయంతో బయటకు తీసి ఫారెస్ట్‌లోకి వదిలి పెట్టారు. దీంతో సమీప అడవుల్లోకి పరుగులు పెట్టాయి.

రిజిస్ట్రేషన్ శాఖలో 70 మంది ఉద్యోగుల బదిలీ

- త్వరలో సబ్ రిజిస్ట్రార్లకు స్థానచలనం?

కరీంనగర్ క్రైం, జూలై 20: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో 70 మంది ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఈ మేరకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించిన అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని 14 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల్లో 46 మంది జూనియర్ అసిస్టెంట్లు, ముగ్గురు షరాఫ్‌లు, 21 మంది అటెండర్లను బదిలీ చేశారు. త్వరలోనే ఉమ్మడి జిల్లాలోని 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని పలువురు సబ్‌రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లకు కూడా బదిలీలు జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. దీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ముగ్గురు మాత్రమే రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్‌లు ఉండగా మిగతా 11 చోట్ల సీనియర్ అసిస్టెంట్లు ఇన్‌చార్జి సబ్ రిజి స్ట్రార్లుగా పనిచేస్తు న్నారు. ఈ 11 చోట్ల రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లను నియమించే అవ కాశముంది. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లున్న చోట్ల భారీఎత్తున అవినీతి జరుగుతున్నట్లు ఆరోప ణలు వస్తున్నాయి. ఇప్పటికైనా రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లను నియ మించి కార్యాలయాల్లో అవినీతి జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య

జ్యోతినగర్, జూలై 20: ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న పన్నాల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక అన్నపూర్ణ కాలనీకి చెందిన శ్రీనివాస్ గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పురుగుల మందు తాగి అస్వస్థతకు గురైన శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మరణించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారైలు ఉన్నారు. ఎన్టీపీసీ పోలీ సులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్య కార ణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు.

రెండు కార్లు ఢీ: నలుగురికి గాయాలు



కల్వర్టులోకి దూసుకు పోయిన కారు

సుల్తానాబాద్, జూలై 20: పట్టణంలోని రాజీవ్ రహదారిపై శనివారం రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఓ కారు రాజీవ్ రహదారి పక్కనున్న కల్వర్టులో పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మహదేవ్ పూర్ నుంచి ఓ కుటుంబం వైద్య చికిత్స నిమిత్తం కరీం నగర్‌కు వెళ్లింది. తిరిగి శనివారం మహదేవ్‌పూర్‌కు వెళుతున్నారు. ఈ క్రమంలో వారి కారు సుల్తానాబాద్ పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్ సమీపం నుంచి వెళ్తుండగా పెద్దపల్లి నుంచి కరీంనగర్ మార్గం లో వెళుతున్న మరో కారు యూటర్న్ తీసుకుంటూ వేగంగా ఢీకొ ట్టింది. దీంతో కారు రోడ్డు పక్కన గల కల్వర్టులో పడి పోయింది. ప్రమాదంలో కారులోని ఇద్దరు మహిళలు, ఇద్దరు పురు షులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: యువకుడి మృతి



రాజేందర్(ఫైల్)

దండేపల్లి, జూలై 20: దండేపల్లి మండ లం కన్నెపల్లిలో సదానందయ్య స్వామి ఆలయ సమీపంలో ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి ఎదురె దురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో యువ కుడు మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామా నికి చెందిన వేల్పాల రాజేందర్ (39) మండలంలోని గూడెం షిర్డీ సాయి బాబా ఆలయంలో కుటుంబ సమేతంగా పని చేస్తున్నాడు. పనుల నిమిత్తం శుక్రవారం రాత్రి అత డితో పని చేసే పుల్లూరి నరేష్‌తో కలిసి బైక్‌పై లక్సెట్టిపేట వెళ్లారు. తిరిగి గూడెం ఆలయం వైపునకు వస్తుండగా గూడెం నుంచి లక్సెట్టిపేట కరీంనగర్ చౌరస్తా వైపునకు వేగంగా వచ్చిన బైక్ ఎదు రుగా వస్తున్న రాజేందర్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేం దర్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాల య్యాయి. లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజేందర్ మృతి చెందాడు. రాజేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రా జేందర్ భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నా మని ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

పాతకక్షలతో గొడ్డలితో దాడి

- ఒకరికి తీవ్ర గాయాలు

మానకొండూర్, జూలై 20: మండలంలోని దేవంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి పాతకక్షలను దృష్టిలో పెటుకొని ఓ వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన యువకుడు, అతడి తండ్రి గొడ్డలతో దాడికి పా ల్పడ్డ సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యా యి. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవంపల్లి గ్రామానికి చెం దిన గాడిచర్ల తిరుపతి అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన గాడిచ ర్ల రాజు అనే వ్యక్తుల ఇళ్లు ప్రక్కపక్కనే ఉన్నాయి. ఇంటి వద్ద గ ల మూడు గజాల భూమి విషయంలో గతంలో గొడవలతో పం చాయతీ జరిగింది. కాగా శుక్రవారం రాత్రి గ్రామంలో వంశీ, గాడిచ ర్ల సాయికుమార్ అనే వ్యక్తులు ఒక్క దగ్గర ఉన్నాడు. ఆ సమయంలో గాడిచర్ల తిరుపతి వ్యక్తి గత పనిపై వెళుతూ రాత్రి అయింది ఇంటికి వెళ్లు అంటూ వంశీని మందలించినట్లు తెలిపా రు. దీంతో సాయికుమార్ పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని ఇంటికి వెళ్లి తండ్రి రాజుతో కలిసి గొడ్డలి పట్టుకొని అకస్మాత్తుగా తిరుప తి భుజం, వీపుపై మూడు చోట్ల దాడికి పాల్పడ్డారు. అనంతరం పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ తిరు పతిని కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి త రలించారు. తిరుపతి సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు ద ర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏసీడీపీ పనులపై ఆడిట్ కొరడా

- నిబంధనలకు విరుద్ధంగా విడుదలైన నిధుల రికవరీకి ఆదేశాలు
- ఎన్నికల ముందు అడ్డగోలుగా కేటాయింపులు
- నిబంధనలు గాలికి..గుడ్డిగా ప్రొసీడింగ్‌లు



రికవరీకి ఆదేశించిన ఎల్‌ఐసీ ఏజెంట్ల భవనం

కోల్‌సిటీ, జూలై 20: నియోజకవర్గాల అభివృద్ధి పనుల్లో నిబంధనల ఉల్లంఘనలపై రాష్ట్ర ఆడిట్ విభాగం కొరడా ఝుళిపించింది. ఎన్నికలకు ముందు నిబంధనలను గాలికివదిలి ఇష్టారాజ్యంగా నిధులు కేటాయించడం, ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు ఎలాంటి హామీ పత్రాలు లేకుండా నిధులు ఇవ్వడాన్ని ఆడిట్ తప్పుపట్టింది. రామగుండం నియోజకవర్గ పరిధిలోని కార్పొరేషన్ ఏరియాలో జరిగిన రెండు పనులకు చెల్లించిన బిల్లుల రికవరీకి అకౌంటెంట్ జనరల్(ఆడిట్) ఆదేశాలు జారీ చేసింది. ఆడిట్ అభ్యంతరాలతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం ప్రస్తుతం జరుగుతున్న పనులు, టెండర్ల దశలో ఉన్న పనులపై దృష్టి పెట్టింది. నిబంధనలు అమలు చేస్తేనే పనుల కేటాయింపులు ఉంటాయంటూ స్పష్టం చేస్తుంది. ఇప్పటికే నిధులే లేని నియోజకవర్గ అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఒక్కో పనికి ఐదారుసార్లు టెండర్లు పెట్టినా స్పందన కరువైంది.

● ఎన్నికల సమయంలో..

కొవిడ్‌తో రెండేళ్ల నియోజకవర్గ అభివృద్ధి పనులు (సీడీపీ) ఆపిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో మూడు కోట్ల రూపాయలు కేటాయించింది. రామగుండం నియోజకవర్గ పరిధిలోని కార్పొరే షన్‌లోనే 116పనులకు కేటాయింపులు జరిగాయి. వీటిలో కుల సంఘాలు, కళా సంఘాలు, దేవాలయాల్లో మండపాలు, యు వజన సంఘాలు, గణపతి మండపాలు, వ్యాపారవర్గాల అసోసియేషన్లు, మహిళా సంఘాల భవనాల వరకు కేటాయింపులు చేశారు. ఇందులో కొన్ని పనులను మ హిళా సంఘాల పేర నామినేషన్లపై కేటాయించారు. పలు పనులకు టెండర్లు పెట్టారు. వీటిలో కొన్ని పనులు ప్రారం భం కాగా కొన్నింటికి టెండర్లు పూర్తయ్యాయి. మరో 30 పనులకు టెండర్ల దశలోనే ఆగిపోయాయి.

● కేటాయిపునకు సంబంధించి..

సీడీపీ నిధుల కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. ఈ నిధులను ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలకు కేటాయించాల్సి ఉంటుంది. ఒక వేళ ప్రైవేట్ సంస్థలకు కేటాయింపులు జరిగితే సదరు ఆస్తి, స్థలాలు ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. రామగుండం నియోజకవర్గంలో నిధులు కేటాయించిన ప్రాంతాల్లో మెజార్టీగా భూముల సమస్య ఉంది.

● రెండు పనుల నిధులు..

రామగుండం అర్బన్‌లో సీడీపీ నిధులతో జరిగిన రెండు పనుల నిధుల రికవరీకి ఏజీ ఆడిట్ ఆదేశాలిచ్చింది. గోదావరి ఖని సప్తగిరికాలనీలో నిర్మాణం పూర్తయిన ఎల్‌ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ భవనం, గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ భవనాల్లో జరిగిన చెల్లింపులను రికవరీ చేయాలంటూ చీఫ్ ప్లానింగ్ అధికారి రామగుండం కమిషనర్‌కు లేఖ పంపారు. ఇప్పటికే చెల్లింపులు జరిగిపోవడంతో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ రికవరీలు జరిగితే పనుల సిఫార్సు చేసిన అధికారులు కూడా బాధ్యులయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగం ఇందులో ముందస్తుగా నిబంధనల ప్రకారం వ్యవహరించలేదనే ఆరోపణలు న్నాయి. ఏజీ ఆడిట్ ఆదేశాలతో అప్రమత్తమైన సీపీఓ కార్యా లయం బిల్లుల చెల్లిం పులకు వెళుతున్న ఫైళ్లను తిప్పి పంపుతుంది. నిర్మాణాలు జరిగిన స్థలాలు ప్రభుత్వంది అయితేనే చెల్లింపులు చేస్తామని ఖరాఖండిగా పేర్కొంటోంది. ప్రభుత్వ, సింగరేణి స్థలాల్లో జరిగిన నిర్మాణాలకు ఓకే చెబుతున్న సీపీవో కార్యాలయం ప్రైవేట్ స్థలాల్లో జరిగిన నిర్మాణాల విషయంలో అభ్యంతరాలు చెబుతోంది. దీంతో పనులు మొదలు పెట్టని కాంట్రాక్టర్లు వెనుకడుగు వేస్తున్నారు. కొన్ని అసోసియేషన్లు, వ్యాపార సంఘాలు, కుల సంఘాలకు పట్టా భూములు ఉన్నాయి. వాటిని చందాల సొమ్ము పోగేసి కొనుగోలు చేశారు. ఈ నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి అప్పగించేందుకు సిద్ధంగా లేరు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ అవసరాలకు వినియోగించు కునేలా పూర్తి స్థాయి హక్కులు ఇవ్వాల్సి ఉంటుంది. ముందస్తు చర్యలు తీసుకోకుండానే జిల్లా యంత్రాంగం ప్రొసీడింగ్‌లు జారీ చేసింది.

● ఆరు సార్లు టెండర్లు పెట్టినా..

ఏసీడీపీ నిధులను సాధారణంగా ప్రజా అవసరాలు తీర్చే పనులకు కేటాయింపులు చేస్తారు. మౌలిక వసతులు, తాగునీరు, పాఠశాలలు వంటి పనులకు కేటాయింపులు చేస్తారు. 20శాతం నుంచి 30శాతం మేర కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు కేటాయిస్తారు. ఎన్నికలకు ముందు జిల్లాలో దాదాపుగా మెజార్టీ కుల సంఘాలకు కేటాయింపులు చేశారు. రామగుండం నియోజకవర్గంలో ఒక్కో కుల సంఘానికి ఏరియాల వారీగా భవనాలకు నిధుల కేటాయింపులు చేశారు. ఇప్పుడు ఆడిట్ అభ్యంతరాలు వ్యక్తం కావడం, నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సుమారు 30 పనులకు ఐదారు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేయడం లేదు.

● జిల్లా అంతటా ప్రభావం..

సీడీపీ పనులకు సంబంధించి నిబంధనలు కఠినతరం కావడంతో జిల్లాలో ఎన్నికలకు ముందు కేటాయించిన పనులపై ప్రభావం పడనున్నది. అప్పటి ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ఎన్నికల వేళ జిల్లా అధికారులు కూడా ప్రొసీడింగ్‌లు జారీ చేశారు. ఇప్పుడు పనులు చేయించేందుకు అధికారులు వెనుకడుగు వేసున్నారు. సీపీవో కార్యాలయంలో నిబంధనల విషయంలో కచ్చితంగా వ్యవహరిస్తున్నారు.

హుజూరాబాద్ ఆస్పత్రిలో వైద్యుల కొరత

- ఇటీవల ఏడుగురు బదిలీ.. వారి స్థానంలో వచ్చింది ముగ్గురే.. - ఇబ్బంది పడుతున్న ప్రజలు



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి

హుజూరాబాద్, జూలై 20: హుజూరాబాద్ ప్రాంతానికి పెద్దదిక్కుగా ఉన్న ఏరియా ఆస్పత్రిలో రెండ్రోజుల క్రితం సాధారణ బదిలీల్లో ఏడుగురు వైద్యులు వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ముగ్గురిని మాత్రమే నియమించారు. దీంతో వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. హుజూరాబాద్ డివిజన్‌లో ఏడు మండలాలకు ఒకటే ఏరియా ఆస్పత్రి ఉండడంతో అందులో డాక్టర్ల కొరత ఏర్పడింది. ఈ ఆస్పత్రిలో ప్రసవాలు, శస్త్ర చికిత్సలు విరివిగా జరిగేవి. గైనకాలజిస్టు డాక్టర్ వాణీలత, సివిల్ సర్జన్ శ్రీకాంత్‌రెడ్డి, పల్లవి, శ్రీనివాస్, మహిపాల్‌ను కరీంనగర్‌కు, డాక్టర్ ప్రత్యూషను పరకాల, డాక్టర్ అర్చనను వర్ధన్నపేటకు బదిలీ చేశారు. వీరి స్థానంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి గైనకాలజిస్టు వైద్యులుగా డాక్టర్ నిశ్చలరెడ్డి, పిల్లల వైద్యులుగా సుభాంగిని, జనరల్ మెడిసిన్ వైద్యుడి రాజేష్ వచ్చారు. సోమశేఖర్ అనే వైద్యుడు కూడా బదిలీ కానున్నట్లు తెలిసింది. హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఏకైక సర్జన్‌గా ఉన్న శ్రీకాంత్‌రెడ్డిని కరీంనగర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సర్జన్ రాలేదు. ఇప్పటికైనా రాష్ట్ర వైద్యాధికారులు, కలెక్టర్ పమేలా సత్పతి స్పందించి హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

జగిత్యాలరూరల్, జూలై20: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన తాళ్ల బుచ్చిమల్లు శనివారం ఉదయం వృత్తిరీత్యా తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టు పై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాయ్యాడు. కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట, జూలై 20: ఓ కాంట్రాక్టు పనిలో వ్యాపార భాగస్వామిగా చేర్చుకుంటామని రూ.82లక్షలు తీసుకొని మోసగించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. ఇచ్చిన డబ్బులు అడిగితే మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, ఎర్రంరాజు సురేందర్‌రాజు అనే వ్యక్తులు తనని చంపుతామని బెదిరింపులకు గురి చేస్తున్నారని, ఆబాది జమ్మికుంటకు చెందిన బాసని పాపిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావును వివరణ కోరగా తాను ఎవరి దగ్గర డబ్బులు తీసుకోలేదని చెప్పారు. తనకు చెడ్డ పేరు తీసుకు రావడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురిపై కేసు

పాలకుర్తి, జూలై 20: బసంత్‌నగర్ పోలిస్టేషన్ పరిధిలోని కన్నాల టోల్ ప్లాజా వద్ద గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి శనివారం తెలిపారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు రెండు బైక్‌ల పై అను మానాస్పదంగా కనిపించారని చెప్పారు. అదుపులోకి తీసుకొని విచారించగా రామగుండం గ్రామానికి చెందిన బానోత్ రమేష్ , గుగులోత్ రాజేష్‌నాయక్, ఈసాల తక్కళ్లపల్లికి చెందిన గాలిపెల్లి నిఖిల్ గంజాయిని తోకల సిద్ధార్థ నుంచి కొనుగోలు చేశామని ఒప్పుకున్నారని తెలిపారు. సుమారు 242 గ్రాముల గంజాయి , రెండు బైకులు, సెల్ ఫోన్‌లు స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు సీఐల బదిలీలు

కరీంనగర్‌క్రై, జూలై 20: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మానకొండూర్ నూతన సీఐగా జి సదన్‌కుమార్‌ను నియామకం చేయగా ఇప్పటి వరకు మానకొండూర్ సీఐగా పనిచేస్తున్న ఎం రాజ్‌కుమార్‌ను మల్టీజోన్-1 ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్వర్లుల్లో పేర్కొన్నారు. ఈనెల 6న మల్టీజోన్-1 ఐజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న సదన్‌కుమార్‌ను మానకొండూర్ సీఐగా, రాజ్‌కుమార్‌ను రామగుండంలో కమిషనరేట్‌లోని మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మానకొండూర్ సీఐగా సదన్‌కుమార్‌ను నియామకం చేస్తూ ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.

కాలువలు ఇలా.. సాగునీరు ఎలా?



డి90 కాలువలో మొక్కలు

చొప్పదండి, జూలై 20: చొప్పదండి మండలంలో పంటకాలువల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. డి88, డి90 కాలువలకు ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో పిచ్చి చెట్లతో నిండి పోయాయి. దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందక రైతులు ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో డి83 నుంచి 90 వరకు డిస్ట్రిబ్యూటరీ కాలువలు ఉండగా డి83, డి86 కాలువలు పెద్దపల్లి జిల్లాకు నీటిని సరఫరా చేస్తారు. మిగతా కాలువల ద్వారా మండల పరిధిలో వ్యవసాయ భూములకు నీరు అందుతుంది. అధికారులు స్పందించి కాలువలకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

- ప్రాజెక్టులోకి 18,275 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు రాక పెరుగుతోంది. ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 18,275 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి శనివారం ప్రస్తుతం 17.662 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 28.541 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 12.163 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.021 టీఎంసీల నీటిని వివిధ అవస రాల నిమిత్తం వ్యయం చేశారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి చేరిన వరదనీరు

ధర్మపురి వద్ద స్వల్పంగా పెరిగిన గోదావరి



ధర్మపురి వద్ద పారుతున్న గోదావరి

ధర్మపురి, జూలై 20: ధర్మపురి వద్ద గోదావరి నది నీటి మట్టం శనివారం స్వల్పంగా పెరిగింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసి న వర్షాలకు ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతోంది. కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టుకు సంబం ధించిన 8, 9, 11 వ నెంబర్ గేట్లు ఎత్తి వేశారు. సాయంత్రం 6-30 గంటల వరకు అధికారులు గోదావ రి దిగువకు 11,016 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. దీంతో ప్రస్తుతం గోదావరి నీటి ప్రవాహం స్వల్పంగా పెరిగింది. ఎగువ వైపు ఉన్న సత్యవతి గుండం నుంచి దిగువ రాయపట్నం వైపు వరద ప్రవాహం కొనసాగుతోంది. ధర్మపురి వద్ద ఉసిరిక వాగు ఆనుకుని నీటి ప్రవాహం ఉంది. వాగు దాటి అటు వైపు వెళ్లలేని పరిస్థితి ఉంది. చిన్న గడ్డె నీటిలో మునిగిపోగా, మంచి నీటి బావి చుట్టూ ఆనుకుని నీటి ప్రవాహం ఉంది. గోదావరి వరద పరిస్థితి గురించి ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల తహసీల్దార్ కృష్ణచైతన్య ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. గోదావరి నదీ పరిసర గ్రామాలైన ఆరెపల్లి, దొంతాపూర్, రాజారం, దమ్మన్నపేట, ధర్మపురి, తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపర్లను గోదావరి నదీ వైపు వెళ్లకుండా అప్రమత్తం చేశారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఉదయ్ కుమార్, పోలీస్ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేశారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

- మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూలై 20: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అద్దాల మండపంలో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం సందర్శించారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆ యనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు.

కరీంనగర్ జైలును సందర్శించిన న్యాయసేవాధికార కార్యదర్శి

కరీంనగర్ క్రైం, జూలై 20: కరీంనగర్ జిల్లా జైలును శనివారం కరీంనగర్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేష్ సందర్శించారు. జైలులో ఖైదీల యోగ క్షేమాలను, భోజన వసతులు, న్యాయ సేవా, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత జైలులో కాంటీన్, జైలు ఆసుపత్రి, ములాఖత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరి, వంటశాల, జైలు ఇండస్ట్రీలలో పనితీరు బాగా జరుగుతుందని అధికారులను అభినందించారు. ఖైదీలతో మాట్లాడుతూ పోక్సో యాక్టు, ఎన్‌డీపీఎస్, మోటార్‌వేహికల్ యాక్టు, సీనియర్ సిటిజన్ యాక్టు, 498-ఎ యాక్టు వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా జైలును కూడా సందర్శించి మహిళా ఖైదీలతో మాట్లాడుతూ వారి కేసు వివరాలను, బాగోగులను, జైలులో వారికీ కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. జైలులో మహిళా ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు ప్రవేట్ లా యరును పెట్టుకునే స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వ లాయర్‌ను నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కే శ్రీనివాస్, జైలర్స్ పి శ్రీనివాస్, బి రమేశ్, డిప్యూటీ జైలర్స్ ఏ శ్రీనివాస్‌రెడ్డి, ఎం సుధాకర్‌రెడ్డి, లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సిల్ లాయర్ తణుకు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించమన్నందుకు మహిళ హత్య

- మృతదేహాన్ని గోనెసంచిలో మూటకట్టి బావిలో వేసిన నిందితులు
- హత్యలో పాల్గొన్న ముగ్గురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేశ్

మంథని, జూలై 20: తీసుకున్న అప్పును తిరిగి ఇవ్వమని అడినందుకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన పెరుక రాజేశ్వరి(65) అనే మహిళను అదే గ్రామానికి చెందిన అమ్ము రజిత అలియాస్ లావణ్య, భర్త రవి అలియాస్ రమేష్, కుక్కముడి తిరుపతి ఈనెల 5న హత్య చేశారని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ తెలిపారు. మంథని పోలీసు స్టేషన్‌కార్యాలయంలో రాజేశ్వరి హత్యకు సంబంధించిన వివరాలను గోదావరిఖని ఏసీపీ రమేశ్ శనివారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లావణ్య తన ఇంటి సమీపంలోని పెరక రాజేశ్వరి వద్ద లక్షా యాభై వేల రూపాయలు అప్పుగా తీసుకుంది. రాజేశ్వరి తరుచూ అప్పు డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగేది. దీంతో ఆగ్రహించిన లావణ్య ఈనెల 5వ తేదీన అప్పు ఇస్తానని రాజేశ్వరిని ఇంటికి పిలిచింది. అనంతరం భర్త రవి, మరో వ్యక్తి కుక్కముడి తిరుపతితో కలిసి ఇంట్లో గొంతు నులిమి చంపారు. అదే రోజు రాత్రి మృతురాలి ఒంటి ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలను తీసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని గొనె సంచిలో మూట కట్టి పారుపల్లి శివారులోని వ్యవసాయ బావిలో వేశారు. అనంతరం బంగారు ఆభరణాలను వరంగల్‌లో విక్రయించారు. అనంతరం 8వ తేదీన స్థానికులు వ్యవసాయ బావిలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. తాడుతో కట్టి ఉన్న గోనసంచి మూటను బయటకు తీసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. 14వ తేదీన మృతదేహం పెరుక రాజేశ్వరిదిగా గుర్తించారు. అనంతరం విచారణ చేపట్టగా ముత్తారం గ్రామానికి చెందిన లావణ్య లక్షా యాభై వేల రూపాయలు మృతురాలు రాజేశ్వరి వద్ద అప్పుగా తీసుకున్నట్టు గుర్తించారు. అప్పు విషయంలో లావణ్యకు, రాజేశ్వరికి మధ్య గొడవలు జరిగాయి. పోలీసులు లోతుగా విచారణ చేపట్టగా రాజేశ్వరిని ఈ నెల 5వ తేదీన లావణ్య, ఆమె భర్త రవి అలియాస్ రమేష్, మరో వ్యక్తి కుక్కముడి తిరుపతి హత్య చేశారని తేలింది. ముగ్గురు నిందితులను శనివారం ఉదయం మంథని సీఐ వెంకటేశ్వర్లు, ముత్తారం ఎస్‌ఐ మధుసూదన్‌రావు అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ, ఎస్‌ఐ, కానిస్టేబుల్స్ దుబాసి రమేష్, బాలగాని కిరణ్‌లను ఏసీపీ రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.


ఐదుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల క్రైం, జూలై20: ఉద్యోగాల కల్పన పేరుతో లోకల్ యాప్‌లో ప్రకటనలు ఇచ్చి సైబర్ మోసాలకు పాల్పడిన ఐదుగురు అంతర్ రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన దూస రమ్య ఉద్యోగం కోసం లోకల్ యాప్‌లో ప్రకటన చూసి ఫోన్ నంబరులో సంప్రందించింది. రూ.400 చెల్లించాలనడంతో ఫోన్ పే ద్వారా పంపింది. అనంతరం ఆమెకు ఫోన్ చేసిన నిందితులు జాబ్ వచ్చిందని ఐడీ క్రియేషన్ కోసం రూ.5 వేలు చెల్లించాలని నమ్మించారు. వెంటనే బాధితురాలు డబ్బు పంపింది. ఉద్యోగం ఎప్పుడు ఇస్తారని బాధితురాలు ఫోన్‌చేయగా మళ్లీ రూ.5 వేలు చెల్లించాలనడంతో పంపింది. ఆ తర్వాత ఆ ఫోన్ నంబరు రెస్పాన్స్‌లో లేకపోవడంతో సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో ప్రత్యేక పోలీసు బృందం ద్వారా విచారణ చేపట్టగా సైబర్ మోసం వెలుగు చూసింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ జిల్లా శారదానగర్‌లో ఎర్రబద్ది గోపి (31), సోమందేపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన కురుబా అశోక్‌కుమార్ (18), కురుబా వరలక్ష్మి (21), బీచ్ అగ్నిపల్లికి చెందిన ఎం. బ్రహ్మేంద్ర (19), పుట్టపర్తి సత్యసాయి జిల్లా పరిగి మండలంలోని సెయ్యిపల్లి గ్రామానికి చెందిన ఎం.స్వాతి సంజీవప్ప (19)ను రిమాండ్‌కు తరలించారు. ఎర్రబద్ది గోపి అనే యువకుడు ట్రాన్స్ ఇండియా కార్పొరేషన్ నెట్‌వర్క్ అనే కంపెనీ పేరుతో అనంతపూర్ జిల్లాలో లోకల్‌యాప్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటనలు ఇచ్చాడు. దీంతో అదే కంపెనీలో పనిచేస్తున్న అశోక్, వరలక్ష్మి, బ్రహ్మేంద్ర, స్వాతి రూ.10 వేల చొప్పున చెల్లించారు. ఆ తర్వాత కమీ షన్ వస్తుందని చెప్పి వారికి ఐడీ కార్డులు ఇచ్చి నిరు ద్యోగులను చేర్పించాలని చెప్పాడు. వారి ద్వారా అదేపనిగా మల్టీ లెవల్ మార్కెటింగ్ విధానంలో కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి తెలంగాణ, ఏపీలో సైబర్ మోసాలకు పాల్పడ్డాడు. ఈ కంపెనీపై 10 ఫిర్యాదులు ఉన్నాయని, నిందితుల వద్ద ల్యాప్‌టాప్, ఐదు మొబైల్స్, బ్యాంక్ అకౌంట్స్ సీజ్ చేశామని ఎస్పీ వివరించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశం



అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సన్మానిస్తున్న సభ్యులు

కరీంనగర్ లీగల్, జూలై 20: తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్త పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాసిక్యూటర్ల సమస్యలు, సందేహాలపై చర్చించారు. క్రిమినల్ కేసులు విచారణకు వచ్చే ముందు ప్రాసిక్యూటర్లకు వాటిపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. నిందితులకు శిక్షలు పడేలా దృష్టి సారించాలని ఆయన ప్రాసిక్యూటర్లకు సూచించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీధర్ రావు కొత్త చట్టాల గురించి వివరించారు. ఇటీవల కరీంనగర్ నుంచి హుజూరాబాద్‌కు బదిలీ అయిన వసంత, మంథని నుంచి మెట్‌పల్లికి బదిలీ అయిన ప్రణయ్‌లను సన్మానించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆరెల్లి రాములు, జూలూరి శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, పెంట శ్రీనివాస్, లక్ష్మి ప్రసాద్, శరత్ పాల్గొన్నారు.

వరి నాట్లు షురూ



కరీంనగర్ రూరల్ మండలంలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

కరీంనగర్ రూరల్, జూలై20: వానాకాలం సీజన్ వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే వరి నాట్లు పూర్తి చేసుకోవాల్సి ఉండగా సరిపడా వర్షాలు పడకపోవడంతో 45రోజులుగా రైతులు ఆందోళన చెందారు. చెరువుల్లో, కుంటల్లో, బావుల్లో నీరు లేక వెలవెలబోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులు, వాగులకు నెమ్మదిగా జలకళ వస్తోంది. కరీంనగర్ మండలంలో వానాకాలం సీజన్‌లో మొత్తం 13,600 ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా.

అంతర్జాతీయ చెస్ దినోత్సవం



కార్ఖానగడ్డ ప్రభుత్వ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 20: నగరంలోని కార్ఖానగడ్డ ప్రభుత్వ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ చెస్ దినోత్సవం నిర్వహించారు. జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముందుగా కేక్ కట్ చేసి విద్యార్థులకు బోర్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కంకటి అనూప్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు కె.బద్రీనాథ్, ఉపాధ్యాయురాలు కె.జ్యోతిలక్ష్మి, షబానా, చెస్ డెమోక్రటిక్ జిల్లా జాయింట్ సెక్రెటరీ కంకటి సుజన్‌కుమార్, తాటిపల్లి సతీష్‌బాబు, రిటైర్డు ఆర్మీ రాజకుమార్, చెస్ అకాడమీ బాధ్యులు తరుణ్, అభిరామ్, నితిన్ పాల్గొన్నారు.

● భగత్‌నగర్: చెస్‌క్రీడకు ప్రత్యేక స్థానముందని అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్‌లో 6, 7వ తరగతి విద్యార్థులకు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

సెయింట్‌జార్జ్ పాఠశాలలో బోనాల వేడుకలు



వేడుకల్లో విద్యార్థులతో సెయింట్‌జార్జ్ విద్యాసంస్థల చైర్మన్ ఫాతిమారెడ్డి

భగత్‌నగర్, జూలై20: నగరంలోని సెయింట్ జార్జ్ (సీబీఎస్‌ఈ), ప్యారడైజ్ పాఠశాలల్లో శనివారం బోనాల వేడుకలను పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు పోతురాజు అమ్మవారి వేషధారణలతో బోనాలు ఎత్తుకుని డప్పుచప్పుళ్ల మధ్య సంప్రదాయ వేషధారణలతో సందడి చేశారు. కార్యక్రమంలో అకడమిక్ సీఈఓ ఉమాకాంత్, ప్రిన్సిపాల్ టి.వసంత, భార్గవ్, నిరంజన్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.మధు పాల్గొన్నారు.

రైతు బీమాకు పట్టాదారు పుస్తకాలు తప్పనిసరి

కరీంనగర్ రూరల్, జూలై20: రైతు బీమాకు పట్టాదారు పుస్తకాలు తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి బి.సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా కొత్త పాసుపుస్తకాలు పొందిన రైతులు వచ్చే నెల 5 లోగా రైతు బీమాలో నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు.

'కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలి'

కరీంనగర్ టౌన్, జూలై 20: కార్ఖానగడ్డ చౌరస్తాలో గాంధీ విగ్రహం, ఐలాండ్ అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్ ఎక్కువ బిల్ రికార్డు చేయించుకొని అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్ పేరును బ్లాక్ లిస్టులో పెట్టాలని 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత, ఆమె భర్త మెండి చంద్రశేఖర్ కమిషనర్‌ను కోరారు. శనివారం చంద్రశేఖర్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ని కలిసి వినతిపత్రం సమర్పించారు.

విద్యార్థులకు ముగిసిన మూడు రోజుల శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

తిమ్మాపూర్, జూలై20: జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(అటానమస్) కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈనెల 18న ప్రారంభమైనా క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ డాటా అనలిటిక్స్‌పై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసినట్లు విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఈ శిక్షణకు ఏడ్యూనేట్ ఫౌండేషన్ అసోసియేట్స్ ట్రైనర్ లక్ష్మణ్‌రావు హాజరై టెక్నాలజీలో వస్తున్న మార్పులపై అవగాహన కల్పించారని చెప్పారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం సాప్ కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఇనిషియేటివ్‌లో భాగంగా కళాశాలలో స్థాపించిన సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ల్యాబ్ సహాయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐబీఎం కోర్సు శిక్షణ బయట నేర్చుకోవాలంటే గంటకి 80డాలర్లు ఖర్చు అవుతుందని తెలిపారు. తమ కళాశాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.ఎస్.రావు, డీన్ పీకే వైశాలి, విభాగాధిపతి జగదీశన్, కోఆర్డినేటర్ సింధు షా తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు వేడుకలు

హుజూరాబాద్, జూలై 20: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో శనివారం ఆర్యవైశ్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని మహిళలు గోరింటాకు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ముక్క అరుణ, కటకం అరుణ, క్యాస భారతి, కటకం జ్యోతి, శ్రీకోటి త్రివేణి, శివనాథుని స్వప్న, నగునూరి శైలజ, గోలి హిమబిందు పాల్గొన్నారు.

ఎంపీ ఈటలను కలిసిన మాజీ ప్రజాప్రతినిధులు



ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు

వీణవంక, జూలై20: బీఆర్ఎస్ మండల నాయకులు మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను హైదరాబాద్‌లోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బీజేపీలో చేరేందుకు చర్చించినట్టు సమాచారం. ఎంపీని కలిసిన వారిలో మాజీ మార్కెట్ చైర్మన్ వాల బాలకిషన్ రావు, మాజీ జడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు బండారి ముత్తాయ్య, జక్కు నారాయణ, పోతుల నర్సయ్య, మర్రి స్వామి, మ్యాడగోని తిరుపతి, బండా కిషన్ రెడ్డి, పొదిల రమేష్, సమ్మిరెడ్డి, రాజావీరు, చెక్కబండి శ్రీనివాస్, మల్లయ్యతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

'బడ్జెట్‌లో ఉపాధిహామీకి అధిక నిధులు కేటాయించాలి'



మాట్లాడుతున్న కొయ్యడ సృజన్‌కుమార్

భగత్‌నగర్, జూలై 10: కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి 2.5 లక్షల కోట్లు కేటాయించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ కోరారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బికెఎంయు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో ఉపాధి హామీ కూలీలను ఆదుకునే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేయాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేవలం 87 వేల కోట్ల రూపాయల బడ్జెట్ మాత్రమే కేటాయించారన్నారు. దాంతో జాబ్ కార్డు ఉన్న వారందరికి పని దొరకలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఉపాధి కూలీలు 1/3 వంతు పనికి దూరమయ్యారు. బడ్జెట్‌లో నిధులు కేటాయింపుల్లో కోతలు విధించి ఉపాధి హామీ పథకాన్ని ఎత్తి వేయడానికి కేంద్రం కుట్రలు చేస్తోందన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 200 రోజులు పని కల్పించాలన్నారు. ప్రజా పంపిణీ, విద్యా, వైద్యం, గృహ నిర్మాణం ఉపాధిహామీ తదితర పథకాలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా కార్పొరేట్ పక్షపాతిగానే నరేంద్రమోదీ వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఉపాధిహామీ కూలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈజీఎస్ పథకానికి బడ్జెట్ కేటాయింపులు జరగాలని కేంద్ర ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బోయిన అశోక్, నల్లగొండ శ్రీనివాస్, పీచు మల్లారెడ్డి, పురేళ్ల వెంకటయ్య, మహంకాళి రాములు తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞవరాహక్షేత్రంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, జూలై20: నగరంలోని యజ్ఞవరాహ క్షేత్రంలో శనివారం వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామివారికి ఎదుర్కోలు వేడుక

కరీంనగర్ కల్చరల్, జూలై 20: కట్టరాంపూర్ మహాలక్ష్మీ సమేత గోదా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం కల్యాణంలో భాగంగా శనివారం హిందూపూర్ కాలనీలోని డాక్టర్ జయరాములు-ఝాన్సీ దంపతుల నివాసంలో శ్రీవారికి ఎదుర్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. అనంతరం శోభాయాత్రగా అమ్మవార్లను, శ్రీవారిని తిరిగి ఆలయానికి తీసుకొని వెళ్ళారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ గోరక్షక్ విభాగ్ ప్రముఖ్ ఉట్కూరి భార్గవి-రాధాకృష్ణారెడ్డి, సాకేత్, వెంకన్న, సుమతీ-సత్యనారాయణరెడ్డి, అనీశ్, నారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురువులను పూజించాలి

కరీంనగర్ కల్చరల్, జూలై 20: గురువులను పూజించడం అనాదిగా వస్తోన్న సాంప్రదాయమని సాహితీ వేత్త, అవధాని డాక్టర్ గండ్ర లక్ష్మణరావు అన్నారు. నగరంలోని ఫిల్మ్ భవన్‌లో శనివారం ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ముందస్తు గురుపూజా మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మానేరు విద్యా సంస్థల అధినేత కడారు అనంతరెడ్డి, జి కృపాదానం, డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, అనుముల దయాకర్, నాందేవ్, గోగుల ప్రసాద్, గుండేటి రమేశ్, బి.తిరుపతయ్య, మురళి మధు, గొల్లపల్లి రవీందర్, సంస్థ నిర్వాహకుడు సల్వాజి ప్రవీణ్-సంధ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

భగత్‌నగర్, జూలై 20: రేకుర్తి 19వ డివిజన్‌కు చెందిన పర్వతం కిషన్ ఇటీవల మరణించగా రేకుర్తి మాజీ సర్పంచ్ నందెల్లిప్రకాశ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం, బియ్యం అందజేశారు. బుడగ జంగాల కాలనీకి చెందిన మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రాచకొండ నరేష్, శనిగరపు సతీష్, నతానియల్ పాల్గొన్నారు.

కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ మంజూరు చేయాలి

భగత్‌నగర్, జూలై 20: కేంద్ర ప్రభుత్వం 23న ప్రవేశపెట్టే కేంద్రబడ్జెట్‌లో కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ మంజూరు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణకు రావాల్సిన విభజన హామిలు అమలు జరిగేలా కేంద్ర మంత్రి బండి సంజయ్ కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు.

సైబర్‌క్రైం కేసులో నిందితుడికి రిమాండ్

కరీంనగర్ క్రైం, జూలై 20: కరీంనగర్‌లో సైబర్‌క్రైం కేసులో నిందితుడిగా ఉన్న రాజస్థాన్ జోద్‌పూర్‌కు చెందిన నిందితుడిని శనివారం రిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే... తెలంగాణ, తమిళనాడు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సైబర్ క్రైం కేసుల్లో నిందితుడిగా ఉన్న రాజస్థాన్‌లోని జోద్‌పూర్ ప్రాంతానికి చెందిన నిందితుడిని శుక్రవారం జోద్‌పూర్‌లో అరెస్టు చేసిన కరీంనగర్ సైబర్‌క్రైం పోలీసులు కరీంనగర్‌కు తీసుకొచ్చారు. రాజస్థాన్ రాష్ట్రం జోద్‌పూర్‌కు చెందిన అరుణ్ చౌదరి(34) అనే వ్యక్తి టెలిగ్రాం యాప్ ద్వారా జోద్‌పూర్‌లోని గారిసన్ ఇంజనీర్ బనార్(మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్)లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నట్లుగా పేర్కొని క్రిప్టో ట్రేడింగ్‌లో పెట్టుబడులు చేయాలని ఒక 'ఏజెంట్ రిజర్వ్ ఆఫ్' అనే ప్రొఫైల్‌ను క్రియేట్ చేశాడు. కరీంనగర్‌కు చెందిన సాయికష్ణ అనే వ్యక్తి దానిని నమ్మి అరుణ్ చౌదరికి ఏప్రిల్ నెలలో 1.58 లక్షలు పంపించాడు. తరువాత టెలిగ్రాంలో నిందితుడు అరుణ్‌చౌదరి ప్రొఫైల్‌ను తొలగించటంతో మోసపోయానని గ్రహించిన సాయికష్ణ కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన సైబర్‌క్రైం పోలీసులు దర్యాప్తు ప్రారంభించి నిందితుడు అరుణ్‌చౌదరిని జోద్‌పూర్‌లో అదుపులోకి తీసుకుని అక్కడి కోర్టులో హాజరుపరిచారు.

అక్కడి నుంచి ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్ కోర్టులో హాజరుపరిచగా కోర్టు రిమాండ్ విధించడంతో శనివారం సాయంత్రం కరీంనగర్ జైలుకు తరలించారు. నిందితుడి వద్ద నుంచి బాధితుడు మోసపోయిన 1.58 లక్షలను రికవరీ చేశారు.

'మంత్రి పొన్నంపై ఆరోపణలు సరికాదు'



మాట్లాడుతున్న కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి

సుభాష్‌నగర్, జూలై 20: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో అయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థి దశ నుంచి కష్టపడి ఎదిగి నాయకుడయ్యాడని అన్నారు. అబద్దాలు ప్రచారం చేయడంలో బీజేపీ నాయకులు దిట్ట అని విమర్శించారు. ఆగస్టు 15లోపు రెండు లక్షల రుణమాఫీతో 75శాతం రైతులు లబ్ధి పొందనున్నారని, మంత్రి పొన్నం ప్రభాకర్ అన్న మాటలను బీజేపీ వక్రీకరిస్తోందన్నారు.

రుణమాఫీ చేస్తుంటే బీజేపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నాయని, రైతుల కళ్ళల్లో ఆనందాన్ని చూడలేకపోతున్నారని ఆయన అన్నారు. వారిలా నల్ల చట్టాలు తేనందుకు కడుపు మంటగా ఉందా అని ప్రశ్నించారు. నల్ల చట్టాలను తెచ్చి 800 మంది రైతులను పొట్టన పెట్టుకున్న మీరా రైతుల గురించి మాట్లాడేదని బీజేపీ నాయకులను ప్రశ్నించారు. ఇకనైనా చౌక బారు వాఖ్యలు చేయడం మానుకోవాలని కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి హితవు పలికారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ముద్దం తిరుపతి, నూనె గోపాల్‌రెడ్డి, కుంభాల రాజ్‌కుమార్, కనకారెడ్డి, జూపాక సుదర్శన్, చింతల ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

కరీంనగర్ టౌన్, జూలై 20: ఏకకాలంలో రెండు లక్షల రైతుల రుణమాఫీ చేశామంటూ గొప్పలు చెప్పుకుంటు సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ రైతాంగాన్ని మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం నగరంలోని బీఆర్ఎస్ నగరశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు విడతల్లో రుణమాఫీ చేస్తూ ఏకకాలంలో చేస్తున్నామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏక కాలంలో రుణమాఫీ చేశామని చెబుతుంటే మూడు విడతల్లో అంటూ మంత్రులు చెబుతున్నారని, సీఎం, మంత్రుల మాటలకు అసలు పొంతనే లేకుండా పోయిందని అన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీ లన్నిటిని అమలు చేసే వరకు అలుపెరగకుండా బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరును ప్రజల్లో ఎండగట్టాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్, జూలై 20: కాంగ్రెస్ ప్రభుత్వ తీరును బీజేపీ శ్రేణులు ఎప్పటికప్పుడు ఎండకట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. అధికారంలోకి రావడానికి ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయడానికి బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందన్నారు. వందరోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని హామీ ఇచ్చి ఏడు నెలలు దాటినా ఒకటి రెండు తప్ప మిగితావి అమలు కాలేదన్నారు. రైతు రుణమాఫీ విషయంలో కండిషన్లు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ ఎదిగిందన్నారు. కార్యకర్తలందరూ సమష్టిగా కృషి చేస్తేనే స్థానిక సంస్థల్లో బీజేపీ సీట్లు గెలుస్తుందన్నారు. అనంతరం కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా బండి సంజయ్‌కుమార్‌ను రెండోసారి గెలిపించిన పార్లమెంట్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు బాస సత్యనారాయణ, గుగ్గిలపు రమేష్, రాజేంద్రప్ర సాద్, నాగేశ్వర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రమేష్, మాడ వెంకటరెడ్డి, గంగిశెట్టి రాజు, పైళ్ల వెంకట్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, సాయిని మల్లేశం, సంపత్‌రావు, బింగి కరుణాకర్, నిర్మల, స్వామి, వాసుదేవరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అర్బన్ బ్యాంకు సేవలు

గంగాధర, జూలై 20: కరీంనగర్ అర్బన్ బ్యాంకు సేవలు త్వరలో గంగాధర పరిసర ప్రాంత వాసులకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస రెడ్డి తెలిపారు. గంగాధర మండలం మధురానగర్ కూడలిలో శనివారం బ్రాంచ్ భవనం పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15లోపు గంగాధరలో బ్రాంచ్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రారంభోత్సవానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు పివిసి సభ్యులు మడుపు మోహన్, ముక్క భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అందరికీ వర్తింపజేయాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్

శంకరపట్నం, జూలై 20: రుణమాఫీ ప్రతి రైతుకూ ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీపీఐ జనరల్ బాడీ సమావేశం పట్టల సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రుణమాఫీ జరగని రైతులందరికి రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఎక్కువ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆరు వారాలుగా ఉపాధిహామీ వేతనాలు చెల్లించడం లేదని, దీంతో గ్రామీణ ఉపాధిహామీ కూలీలు ఆవేదన చెందుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలన్నారు. ఈ నెల 25న కరీంనగర్‌లో జరిగే రాజకీయ శిక్షణ తరగతులకు శంకరపట్నం మండలంలోని ప్రతి గ్రామం నుంచి కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు విధిగా హాజరు కావాలలని కోరారు. సమావేశంలో కన్నం సదానందం, పిట్టల తిరుపతి, దేవయ్య, పిట్టల రామస్వామి, గోదారి లక్ష్మణ్, మేకల రవి, వెంకటయ్య, రాజు, జయరాజు, అరవింద్, సంపత్, రవీందర్, బాదుల్ల, రవి, ఓదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా షాదీఖానా

- ఆరేళ్లుగా ముస్లింల ఎదురుచూపులు



పూర్తి చేయని షాదీఖానా భవనం

మానకొండూర్, జూలై 20: మానకొండూర్‌లో ముస్లిం షాదీఖానా భవనం పనులు ఆరేళ్లుగా అసంపూర్తిగానే ఉన్నాయి. మండల కేంద్రంలోని చెరువు కట్ట కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి ప్రక్కన గ్రామానికి చెందిన మహ్మద్ బాష్‌మియా అనే వ్యక్తికి చెందిన ఎకరం 20గుంటల తన స్వంత భూమిని షాదీఖాన నిర్మాణానికి విరాళంగా ఇచ్చాడు. కాగా ఈ స్థలంలో తెలంగాణ సంక్షేమ శాఖ ఉర్దూ ఘర్ ముస్లిం షాదీఖానను నిర్మించేందుకు కోటి రూపాయలను రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసింది. 12 ఏప్రిల్ 2018న అప్పటి పార్లమెంట్ సభ్యులు బోయినిపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్, అప్పటి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌లు షాదీఖాన నిర్మాణానికి భూమిపూజ చేశారు. సదరు కాంట్రాక్టర్ బేస్‌మిట్ వరకు నిర్మించి వదిలేశాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టకపోవడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయింది. మానకొండూర్‌లో షాదీఖాన నిర్మాణం అయితే ఎంతో ఉపయోగపడుతుందని అనుకున్న పేద ముస్లింల ఆశలు అడియాసలు అయ్యాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకొని షాదీఖాన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

'సిద్ధార్థ'లో గ్రీన్ డే

కరీంనగర్ టౌన్, జూలై 20: కరీంనగర్‌లోని మంకమ్మతోట, భగత్‌నగర్, విద్యానగర్, సీతారాంపూర్ ప్రాంతాల్లో నెలకొల్పిన సిద్ధార్థ విద్యా సంస్థల్లో శనివారం 'గ్రీన్ కలర్ డే వేడుకలు' ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆకుపచ్చ వర్ణంలో ఉన్న దుస్తులు ధరించి, ఆహార పదార్థాలు, కూరగాయలు, వస్తువులతో తరగతి గదులను అలంకరించారు. వేడుకల్లో విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, జూలై 20: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6-30 గంటల నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల వేంకటేశ్వర్లు ఆతిథ్యంలో చైతన్యపురిలో 135వ ఎన్నీల ముచ్చట్ల సాహిత్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

'కాంగ్రెస్‌పై అసత్య ఆరోపణలు'

కరీంనగర్ అర్బన్, జూలై 20: రైతు పక్షపాతి అయిన కాంగ్రెస్ పార్టీకి రైతులలో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మాజీ టీపీసీసీ జాయింట్ సెక్రెటరీ ములకల ప్రవీణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు భరోసా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన అసత్య ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

గాలిపెల్లి కుమార్‌కు అవార్డు

సుభాష్‌నగర్, జూలై 20: ఉత్తమ రక్తదాత అవార్డు గ్రహీత గాలిపెల్లి కుమార్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈయన సేవలను గుర్తించి శనివారం హైదరాబాద్‌లోని వైశ్యభవన్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) ఆధ్వర్యంలో గాలిపెల్లి కుమార్‌కు ఉత్తమ సేవకుడి అవార్డును అందచేశారు.

అంగన్‌వాడీల్లో మూడో తరగతి సమంజసం కాదు

కరీంనగర్ టౌన్, జూలై 20: అంగన్‌వాడీ కేంద్రాలను ప్లేస్కూల్స్‌గా మార్చి మూడో తరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదన సమంజసం కాదని, విరమించుకోవాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, ప్రధాన కార్యదర్శి జావెద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు మూడు తరగతులను అప్పగిస్తే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మూసివేసే ప్రమాదం ఉందన్నారు.

'ముద్దసాని సేవలు మరువలేనివి'

సుభాష్‌నగర్, జూలై 20: స్వర్గీయ ముద్దసాని దామోదర్ రెడ్డి సేవలు మరువలేనివని రైతు సంఘాల జాతీయ నాయకుడు పొలాడి రామారావు అన్నారు. శనివారం ముద్దసాని దామోదర్‌రెడ్డి 68వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

కరీంనగర్ రూరల్, జూలై20: మండలంలో పలు గ్రామాల్లో అమ్మ మాట, అంగన్ వాడీ బాట కార్యక్రమం కొనసాగుతుంది. గ్రామాల్లో అంగన్ వాడీ కేంద్రాల్లో చేర్పించిన పిల్లలకు అక్షరభ్యాస కార్యక్రమాలు చేపడుతుండగా జూబ్లీనగర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు గ్రామ పూజారి రమేష్ అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో విఓ అధ్యక్షురాలు మల్లేశ్వరి, ఆశ వర్కర్‌లు వసంత, అంగన్ వాడీ టీచర్లు స్వరూప తల్లులు హజరయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జూలై 20: నగరంలో ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎంపీడీవో కార్యాలయం, కార్యాలయం, ఎల్ఐసి ఆఫీస్ ఏరియా, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు.

రేపు గండ్ర హనుమంతరావు స్మారక సాహితీ పురస్కారం ప్రదానం

కరీంనగర్ కల్చరల్, జూలై 20: సమతా సాహితి ఆధ్వర్యంలో సోమవారం భగత్‌నగర్ భగవతి విద్యాసంస్థలో 'షట్చక్రం' విమర్శ గ్రంథకర్త లక్ష్మణ చక్రవర్తికి గండ్ర హనుమంతరావు స్మారక సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు ఉపాధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి విలాసాగరం రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ

రామడుగు, జూలై 20: మండలంలోని వన్నారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్ ఆధ్వర్యంలో గాజుల శ్రీనివాస్ నోటుబుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 250 నోటుబుక్స్‌ను అందజేస్తున్న గాజుల శ్రీనివాస్‌ను మాజీ ఎంపీపీ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీరాజ్యం, పంచాయతీ కార్యదర్శి పెద్ది నవిత, మాజీ ఉప సర్పంచ్‌లు ఓం ప్రకాష్, గూత్తురి శ్రీనివాస్, మల్లేశం, పుర్రెలు భరత్ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

చొప్పదండి, జూలై 20: చొప్పదండిలోని సిద్ధార్థ పాఠశాలలో శనివారం విద్యార్థులకు పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్మెన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ప్రతీ విద్యార్థి ఐదు మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. కాగా వీణాదరి స్కూల్‌లో బోనాల పండుగను నిర్వహించారు. విద్యార్థులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాపారులు జీఎస్టీ లైసెన్స్ తీసుకోవాలి

హుజూరాబాద్, జూలై 20: రాష్ట్రంలో వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ తప్పకుండా జీఎస్టీ లైసెన్స్ తీసుకోవాలని వాణిజ్య పనుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు. హుజూరాబాద్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ రకాల వ్యాపారాలు చేసే వారికి జీఎస్టీ లైసెన్స్ పొందడానికి రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందన్నారు. కార్యాలయానికి వెళ్లకుండా కూడా ఆన్‌లైన్ ద్వారా జీఎస్టీ లైసెన్స్ పొందవచ్చాన్నారు. వ్యాపారులు వెంటనే తీసుకోవాలని సూచించారు.

20వ వార్డులో మొక్కల పంపిణీ

జమ్మికుంట, జూలై 20: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు ప్రజలకు కౌన్సిలర్ దేశిని రాధ-సదానందం శనివారం మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్పీ సృజన, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

వీణవంక, జూలై20: మండలంలోని రైతులు 2024-25 సంవత్సరంకు గాను గతంలో రైతు బంధు పథకంలో పేరు నమోదు చేసుకోని వారు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి గణేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పుస్తకం కలిగి ఉన్నా వారు 5వతేదీలోగా ఏఈవో దగ్గర దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కేశవరావుకు పుష్పగుచ్ఛం అందజేత

జమ్మికుంట, జూలై 20: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన కె కేశవరావును మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పొనగంటి మల్లయ్య హైదరాబాద్‌లో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారి వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.